
సాక్షి
ఒడిశా
బుధవారం । 29 । మే । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు:	రూ.6,28,237
బంగారం:	1000 గ్రాముల 800 మిల్లీ గ్రాములు
వెండి:	1 గ్రాము 200 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ

ఫలితాల్లోనూ ఒకేలా..!



రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు (బీఎస్ఈ) ఇటీవల ప్రకటించిన పదో తరగతి వార్షిక పరీక్షల్లో గంజాం జిల్లాకు చెందిన కవల సోదరీమణులు సమాన మార్కులు సాధించారు.

- 8లో



భారీగా గంజాయి స్వాధీనం

జయపురం ఎక్సైజ్ అధికారులు 22 కేజీల 100 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ అధికారి నీలాద్రి బిహారి మిశ్ర వెల్లడించారు.

- 8లో

న్యూస్‌రీల్

రథాలకు 3 టన్నుల పట్టువస్త్రాలు

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని రథయాత్ర సన్నాహాలు క్రమంగా పుంజుకుంటున్నాయి. రథాల తయారీ అంచెలంచెలుగా ముందుకు సాగుతోంది. తయారీ పనులు నిర్విరామంగా కొనసాగుతుండగా, రథాల అలంకరణ కోసం అవసరమైన పట్టు వస్త్రాలు రథాల తయారీ ప్రాంగణానికి చేరాయి. మూడు రథాల అలంకరణ కోసం 3 టన్నులు పట్టు వస్త్రాలు చేరినట్లు శ్రీజగన్నాథ ఆలయ పాలక వర్గం (ఎస్‌జేటీఏ) తెలిపింది. ముందస్తు ఆర్డరు మేరకు ఈ వస్త్రాలు సరఫరా అయినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. వ్యాపారులు సరఫరా చేసిన పట్టువస్త్రాల నాణ్యతను రథం పనుల్లో నిమగ్నమైన ఆలయ సేవకులు నిర్ధారిస్తారు. ఒక్కో రథానికి ఒక్కో రకం రంగుల వస్త్రాల్ని వినియోగించడం ఆచారం. ఆచారం ప్రకారం పట్టు వస్త్రాలు విభిన్న రంగుల్లో సరఫరా అయినట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ ఏడాది జూలై 8న పూరీలో రథయాత్ర జరగనుంది.

విజిలెన్స్ వలలో పీఈవో



పీఈవో నాయిక్

జయపురం: కొరాపుట్ విజిలెన్స్ డివిజన్ జయపురం అధికారుల వలలో కలహండి జిల్లా తునమూల్ రాంపూర్ సమితి కనిగుమ్మ పంచాయతీ కార్యనిర్వాహక అధికారి(పీఈవో) సన్యాసి నాయిక్ చిక్కారు. రూ.10 వేల లంచం తీసుకుంటూ సోమవారం విజిలెన్స్ అధికారులకు పట్టుబడినట్లు స్థానిక విజిలెన్స్ వర్గాలు వెల్లడించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ రోజ్‌గార్ యోజన పథకంలో(మనోరెగ) ఒక చెక్‌డ్యామ్ పని జరిగింది. అందులో పనిచేసిన కార్మికులకు పేమెంట్ చేసేందుకు పీఈవో నాయక్ లంచం అడిగాడు. దీంతో కార్మికులు ఈ విషయాన్ని విజిలెన్స్ అధికారులు తెలియజేశారు. విజిలెన్స్ అధికారులు ఇచ్చిన సలహా ప్రకారం సోమవారం లంచం డబ్బు ఇస్తామని కార్మికులు పీఈవోకు తెలిపారు. ముందుగా పన్నిన వ్యూహం మేరకు విజిలెన్స్ సిబ్బంది మాటు వేశారు. పీఈవో నాయిక్ కార్మికులు నుంచి రూ.10 వేలు లంచం తీసుకుంటున్న సమయంలో విజిలెన్స్ సిబ్బంది దాడి జరిపి పట్టుకున్నారు. నిందితుడు నుంచి డబ్బు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం భవాణీపట్నలోని అతని ఇంటిపై, లంజిగుడలో మరో ఇంటిపై, అతడి ఆఫీసుపై దాడులు నిర్వహించారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిసింది.

దోపిడీ కేసులో ఇద్దరు నిందితులు అరెస్టు

రాయగడ: ఒక దోపిడీ కేసుకు సంబంధించి శశిఖాల్ పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు మంగళవారం తరలించారు. అరెస్టైనవారిలో నారాయణ నాయక్, సహీద్ సమీర్‌లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. శశిఖాల్ ఐఐసీ మున్ని ఆచార్య తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 14వ తేదీన గోలక్ నాయక్ అనే వ్యక్తి పార్వతీపురం నుంచి రాయగడవైపు లారీని డ్రైవింగ్ చేసుకుంటూ వస్తున్నాడు. అర్ధరాత్రి కావడంతో ఎవరూ లేని సమయాన్ని చూసుకున్న దుండగులు శశిఖాల్ గ్రామానికి సమీపంలో లారీపై రాళ్లతో దాడిచేసి అద్దాలను విరగ్గొట్టారు. అనంతరం లారీలోని నాయక్ వద్ద ఉన్నటువంటి కొంత మొత్తం డబ్బులు, ఇతర సామగ్రిని దోచుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఈనెల 25వ తేదీన శశిఖాల్ పోలీసుస్టేషన్‌లో నాయక్ తనపై జరిగిన దోపిడి గురించి ఫిర్యాదు చేశారు. ఎస్‌డీపీవో రస్మీరంజన్ సేనాపతి, ఐఐసీ మున్ని ఆచార్యల నేతృత్వంలో కేసును దర్యాప్తు చేసిన పోలీసులు, నిందితులను అరెస్టు చేశారు.

15 అడుగుల నాగుపాము పట్టివేత



పట్టుబడిన పాము

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి ఎంవీ 23 గ్రామం వద్దనున్న ఒక క్రసర్‌లో 15 అడుగుల నాగుపాము మంగళవారం కలకలం రేపింది. దీంతో స్థానికులు స్నేక్ క్యాచర్‌కు సమాచారం ఇవ్వడంతో అతను అతి కష్టం మీద పట్టుకున్నారు. అనంతరం జిల్లా అటవీ శాఖ అధికారులు వచ్చి పామును స్వాధీనం చేసుకున్నారు. వైద్య పరీక్షలు చేయించి అనంతరం అడవిలో విడిచిపెడతామని తెలిపారు.

పెరుగుతున్న నేర చరిత అభ్యర్థులు

- మొత్తం అభ్యర్థుల్లో 27 శాతం మందికి నేర చరిత్ర
- బీజేపీ అభ్యర్థుల్లో అత్యధికంగా 68 శాతం మంది



భువనేశ్వర్: ప్రస్తుతం జరుగుతున్న జంట ఎన్నికల్లో, వివిధ రాజకీయ పార్టీలు సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ అభ్యర్థుల స్వీయ ప్రకటిత నేర చరిత్ర కలిగిన అభ్యర్థులను ఎక్కువ మందిని నిలబెట్టాయని ఒడిశా ఎలక్షన్ వాచ్ అండ్ అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫారమ్స్ (ఏడీఆర్) తమ ఉమ్మడి విశ్లేషణలో వెల్లడించింది. 2024 ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, అన్ని రాజకీయ పార్టీలు క్రిమినల్ రికార్డులు ఉన్న అభ్యర్థులను నామినేట్ చేశాయని నివేదిక పేర్కొంది. రాజకీయ పార్టీలు తమ పాత పద్ధతిని అనుసరించాయి. క్రిమినల్ కేసులు ఉన్న 27 శాతం అభ్యర్థులకు టికెట్లు కేటాయించాయి. ఒడిశా ఎన్నికల్లో పోటీ చేస్తున్న అన్ని ప్రధాన పార్టీలు తమపై క్రిమినల్ కేసులు నమోదు చేసుకున్న అభ్యర్థులకు 17 నుంచి 68 శాతం వరకు టిక్కెట్లు ఇచ్చాయి. సుప్రీంకోర్టు 2020 సంవత్సరం ఫిబ్రవరి 13 నాటి ఆదేశాల్లో అటువంటి ఎంపికకు కారణాలను తెలియజేయాలని, నేర చరిత్ర లేని ఇతర వ్యక్తులను అభ్యర్థులుగా ఎందుకు ఎంపిక చేయకూడదని రాజకీయ పార్టీలను ప్రత్యేకంగా ఆదేశించింది.

ఏడీఆర్ విశ్లేషణ ప్రకారం...

ఒడిశా ఎలక్షన్ వాచ్ మరియు ఏడీఆర్ విశ్లేషణ ప్రకారం.. బీజేపీ నుంచి 147 మంది అభ్యర్థుల్లో 100 (68 శాతం) మంది, భారత జాతీయ కాంగ్రెస్ (ఐఎన్‌సీ) నుంచి 145 మంది అభ్యర్థుల్లో 60 (41 శాతం) మంది, బీజేడీ నుంచి 147 మందిలో 46 (31 శాతం) మంది, ఆమ్ ఆద్మీ పార్టీ ఆప్ ద్వారా బరిలోకి దిగిన 41 మంది అభ్యర్థుల్లో ఏడుగురు (17 శాతం) తమ అఫిడవిట్లలో తమపై క్రిమినల్ కేసులను ప్రకటించారు. ఇద్దరు అభ్యర్థుల అఫిడవిట్‌లు తప్పుగా స్కాన్ చేయబడినందున లేదా పూర్తి అఫిడవిట్లు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయబడనందున నివేదిక విశ్లేషించలేదు. ఈ అభ్యర్థులు ఖుర్దా అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన సుప్రీం జీరో పార్టీ ఆఫ్ భారత్‌కు చెందిన బ్రహ్మచారి నాయక్, సంబల్‌పూర్ రెంగాలి (ఎస్సీ) స్థానానికి పోటీ చేస్తున్న అభ్యర్థి ఉన్నారు. మొత్తంగా 2024 ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన 1,283 మంది అభ్యర్థుల్లో 348 (27 శాతం) అభ్యర్థులు తమపై క్రిమినల్ కేసులను ప్రకటించారు. 2019 ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో 1,121 మంది అభ్యర్థులను విశ్లేషించగా 332 (30 శాతం) మంది తమపై క్రిమినల్ కేసులను ప్రకటించారు. 2024 ఎన్నికల్లో తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్న అభ్యర్థుల సంఖ్య కూడా పెరిగింది. 292 మంది (23 శాతం) తీవ్రమైన క్రిమినల్ కేసులను ప్రకటించారు. 2019 ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో 257 (23 శాతం) మంది అభ్యర్థులు తమపై తీవ్రమైన క్రిమినల్ కేసులు నమోదు చేసుకున్నారు.

ఎమ్మెల్యే ప్రశాంత్ జగ్‌దేవ్ నిర్దోషి



అపరాజిత షడంగి ప్రసారం చేసిన సీసీటీవీ ఫుటేజీ

- భువనేశ్వర్ ఎంపీ అపరాజిత షడంగి

భువనేశ్వర్: ఈవీఎం పగలుగొట్టిన కేసులో చిలికా ఎమ్మెల్యే ప్రశాంత్ జగ్‌దేవ్ నిర్దోషి అని భువనేశ్వర్ బీజేపీ ఎంపీ అపరాజిత షడంగి అన్నారు. ఈ మేరకు మూడో విడత ఓటింగ్ సందర్భంగా బెగుణియా శాసనసభ నియోజకవర్గం పరిధిలోని బొలొగొడొ మండలం పోలింగ్‌స్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజీని సోషల్ మీడియాలో మంగళవారం పోస్ట్ చేశారు. తన ఫేస్‌బుక్ ఖాతాలో వీడియోను ప్రసారం చేసిన అపరాజిత షడంగి నిజం ఎప్పుడూ దాచబడదని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే ప్రశాంత్ జగదేవ్ ఈవీఎం పగలగొట్టలేదని వీడియోలో రుజువైందని పేర్కొన్నారు.

సుదర్శన్ పట్నాయక్‌కు అస్వస్థత

భువనేశ్వర్: అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన సైకత కళాకారుడు సుదర్శన్ పట్నాయక్ మంగళవారం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. చికిత్స కోసం ఆయన స్థానిక ఆస్పత్రిలో చేరారు. వైద్యుల పర్యవేక్షణలో ప్రస్తుతం ఆరోగ్యం స్థిమితంగా ఉన్నట్లు తెలిపారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగడంతో చికిత్స కోసం స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. కోవిడ్ – 19 తదనంతర అనారోగ్య పరిస్థితి కావచ్చునని భావిస్తున్నారు. ఈ విషయాల్ని ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో ప్రసారం చేశారు.

పోలింగ్‌స్టేషన్ వీడియోపై విచారణకు ఆదేశం

భువనేశ్వర్: ఖుర్దా జిల్లా బెగుణియా అసెంబ్లీ సెగ్మెంట్‌లోని ఎమ్మెల్యే ప్రశాంత జగదేవ్ పోలింగ్‌స్టేషన్ సందర్శన ఉద్దేశించిన వీడియో ప్రసారం కలకలం రేపింది. ఈ ఘటనపై విచారణ జరపాలని ఖుర్దా జిల్లా ఎన్నికల అధికారికి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మంగళవారం ఆదేశించారు. బెగుణియా అసెంబ్లీ నియోజకవర్గంలోని పోలింగ్‌స్టేషన్‌కు సంబంధించిన వీడియో కొన్ని ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ప్లాట్‌ఫారంలలో చక్కర్లు కొడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. దీనికి సంబంధించి పోలింగ్ రోజు దాదాపు 60 శాతం పోలింగ్‌స్టేషన్లలో ప్రత్యక్ష వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రధాన ఎన్నికల అధికారి, జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారుల కంట్రోల్ రూమ్‌లలో వెబ్ కాస్టింగ్ ప్రత్యక్ష ప్రసారం చేయబడింది. డీఈవో వెబ్‌కాస్టింగ్ రికార్డుల సంరక్షకుడు. ఈ నేపథ్యంలో వెంటనే విచారణ జరిపి స్పష్టత తెలియజేయాలని డీఈవో ఖుర్దాను ఆదేశించారు.

కౌంటింగ్‌కు మూడంచెల భద్రత



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ తదితరులు

పర్లాకిమిడి: జూన్ 4వ తేదీన జరగనున్న ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ కోసం స్థానిక ఎస్‌కేసీజీ కళాశాలలో తగు ఏర్పాట్లు చేస్తున్నామని, దీనికోసం మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ తెలియజేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. గజపతి జిల్లాలో మోహనా, పర్లాకిమిడి అసెంబ్లీ స్థానాలు, బరంపురం పార్లమెంటరీ స్థానం కోసం ఉదయం 8.30 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభమవుతుందన్నారు. మోహనా నియోజకవర్గానికి 30 రౌండ్లు, పర్లాకిమిడికి 28 రౌండ్లు ఉంటాయని, ఒక్కొక్క రౌండ్‌కు పది టేబుల్స్ ఉంటాయని తెలియజేశారు. ఎన్నికల ఓట్ల లెక్కింపునకు 180 మంది ప్రభుత్వ ఉద్యోగులను నియమించామన్నారు. వారిలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని తెలియజేశారు. మోహనా నియోజకవర్గంలో 71.20 శాతం ఓట్లు పోలవ్వగా, పర్లాకిమిడికి 64.23 శాతం పోలయ్యాయని, వాటితో పాటు పోస్టల్ బ్యాలెట్స్ పర్లాకిమిడికి 1,990, మోహనాకు 1,200 కూడా లెక్కించనున్నట్లు వెల్లడించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ప్రతీ వంద మీటర్లకు ఒక భద్రతా వలయం ఉంటుందన్నారు. ఎన్నికల ఫలితాలు కవరేజ్ కోసం మీడియా సెంటర్ ఏర్పాటు చేశామని, దీనికోసం 50 పాస్‌లు ఎన్నికల కమిషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఆయనతో పాటు అదనపు జిల్లా మేజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్, సబ్ కలెక్టర్ అలోక్ పండా ఉన్నారు.

జలపాతంలో పడి యువకుడు మృతి



గమ్యూనల్ సునా (ఫైల్)

కొరాపుట్: జలపాతంలో పడి యువకుడు మృతి చెందిన విషాదకర ఘటన మంగళవారం చోటుచేసుకుంది. నబరంగ్‌పూర్ జిల్లా తెంతులకుంటి సమితి ముండాగుడ గ్రామ సమీపంలోని డకరడొర జలపాతంలో సమీప గ్రామం కంద్రగుడ గ్రామానికి చెందిన గమ్యూనల్ సునా (22) అనే యువకుడు గల్లంతయ్యాడు. స్నానానికి వెళ్లి కాలుజారి లోయలో పడిపోయాడు. గ్రామస్తుల సమాచారంతో తెంతులకుంటి పోలీస్‌స్టేషన్ ఐఐసీ గోపాలకృష్ణ పాత్రో తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నాడు. అనంతరం అగ్నిమాపక బృందాలు గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశాయి.

ఈస్ట్‌కోస్ట్ జనరల్ మేనేజర్‌గా పరమేశ్వర్



పరమేశ్వర్ ఫుంక్వాల్

భువనేశ్వర్: ఈస్ట్‌కోస్ట్ రైల్వే నూతన జనరల్ మేనేజర్‌గా పరమేశ్వర్ ఫుంక్వాల్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అతను ఐఐటీ కాన్పూర్ పూర్వ విద్యార్థి. ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ ఇంజినీర్స్ (ఐఆర్‌ఎస్‌ఈ) 1988 బ్యాచ్ అభ్యర్థి. రైల్వే సేవా రంగంలో దశాబ్దాల విశేష అనుభవంతో రాజ్‌కోట్ మండల రైల్వే అధికారి (డీఆర్‌ఎం), అహ్మదాబాద్ అదనపు మండల రైల్వే అధికారి (ఏడీఆర్‌ఎం), రైల్వే రిక్రూట్‌మెంటు బోర్డు (ఆర్‌ఆర్‌బీ) చైర్మన్ మరియు ఆర్‌డీఎస్‌వో, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వంటి అనేక ముఖ్యమైన హోదాల్లో కీలకమైన బాధ్యతలు విజయవంతంగా నిర్వహించారు. ఇంతకుముందు ఆయన ముంబైలోని పశ్చిమ రైల్వేలో ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్‌గా పని చేశారు. ఆర్డీఎస్‌వోలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పదవీకాలంలో వేగాన్ని పెంచడానికి ట్రాక్ మరియు వంతెనల రంగాలలో వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేయడంలో కీలక పాత్ర పోషించారు. రైల్వే ఇంజనీరింగ్‌తో పాటు మానవ వనరుల విధులు, పరిశోధన – డిజైన్‌లు, సాధారణ పరిపాలనలో అపారమైన అనుభవం కలిగి ఉన్నారు. పలు అంతర్జాతీయ పత్రికల్లో ట్రాక్, బ్రిడ్జ్, పర్యావరణ ఇంజనీరింగ్‌పై అనేక పరిశోధన పత్రాలను ప్రచురించారు. బీజింగ్ (చైనా), కాల్గరీ (కెనడా), న్యూఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ హెవీ హాల్ అసోసియేషన్ (ఐహెచ్‌హెచ్‌ఏ) సమావేశాల్లో పరిశోధన పత్రాలను సమర్పించారు. స్వీడన్, డెన్మార్క్, ఫ్రాన్స్, జర్మనీ, చైనా, కెనడా, మలేషియా, సింగపూర్, ఇటలీ ప్రాంతాల్లో వివిధ శిక్షణ మరియు అధ్యయన కార్యకలాపాల కోసం సందర్శించారు. ఫుంక్వాల్‌కు సాహిత్యంపై అమితమైన ఆసక్తి ఉంది. అతని కొన్ని కవితలు సమకాలీన హిందీ సాహిత్య పత్రికల్లో ప్రచురితం కావడం విశేషం.

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన



ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ కీర్తి వాసన్

జయపురం: స్థానిక విక్రమదేవ్ విశ్వ విద్యాలయంలో ఏర్పాటు చేస్తున్న ఓట్ల లెక్కింపు కేంద్రాలను, స్ట్రాంగ్ రూమ్‌లను కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్ మంగళవారం సందర్శించారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో చర్చించారు. చర్చల్లో ఎస్పీ అభినవ సోన్‌కర్, జయపురం సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పరిడ, కొరాపుట్ అదనపు జిల్లా కలెక్టర్ అలోమణి సెట్టి, జయపురం సబ్ డివిజన్ పోలీసు అధికారి తపశ్వినీ కొహార్, జయపురం మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి సిద్దార్థ పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు. ఓట్ల లెక్కింపు రోజున అధికారులు, జర్నలిస్టులను వర్సిటీ ప్రధాన గేటులో నుంచి కాకుండా దసరా పాడియ మీదుగా అనుమతిస్తారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ సామగ్రిని అనుమతించరు. జర్నలిస్టులు వీడియో రికార్డింగ్ మొబైల్‌లో కాకుండా డిజిటల్ కెమేరాలలో మాత్రమే చేయాలి.

రెండు నియోజకవర్గాల లెక్కింపు

విక్రమదేవ్ వర్సిటీలో జయపురం, కోట్‌పాడ్ శాసన సభ నియోజకవర్గాల ఓట్లు లెక్కిస్తారు. అలాగే ఆ రెండు సిగ్మెంట్లలో ఎంపీ నియోజకవర్గాల ఓట్లు కూడా లెక్కిస్తారు. మొత్తం 25 రౌండ్లు చొప్పున ఓట్లు లెక్కిస్తారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఎక్కువగా వచ్చే ప్రజలను అదుపు చేయడం, రోడ్డు జామ్ కాకుండా రూట్ మ్యాప్‌ను తయారు చేసే బాధ్యతలను జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండికి అప్పగించారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఒక మీడియా సెల్ ఏర్పాటు చేస్తారు. సమావేశంలో జయపురం సమితి బీడీవో శక్తి మహాపాత్ర, తహసీల్దార్ డాక్టర్ మనోలిస ఆచార్య, పట్టణ పోలీసు అధికారి రమణీ రంజన్ దొళాయ్, బొయిపరిగుడ తహసీల్దార్ స్నిగ్ధ చౌదరి, జయపురం సబ్ డివిజన్ సమాచార పౌర సంబంధాల అధికారి యశోద గదబ తదితరులు పాల్గొన్నారు.

రథయాత్ర సన్నాహకాలు



పూరీ శ్రీజగన్నాథుని రథయాత్రలో పాలుపంచుకునేందుకు పలు వర్గాలు సమాయత్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక మున్సిపాలిటీ తన వంతు కార్యాచరణతో సిద్ధమవుతోంది. యాత్ర ఆద్యంతం పారిశుద్ధ్య పరిరక్షణకు ప్రాధాన్యత కల్పిస్తోంది. ఈ కార్యాచరణలో స్వచ్ఛంద సంస్థల సహకారం కోసం పనులు ప్రారంభించింది. దీనిలో భాగంగా ఆయా వర్గాలతో ప్రత్యేక సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు.

– భువనేశ్వర్/పూరీ


విద్యార్థులకు యోగా శిక్షణ



యోగా శిక్షణలో ఎన్‌సీసీ క్యాడెట్లు

జయపురం: స్థానిక విక్రమదేవ్ విశ్వ విద్యాలయంలో జరుగుతున్న ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరంలో విద్యార్థులకు యోగా, మానసిక వికాసంపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బందితో వివిధ విన్యాసాలు జరిపి ఎన్‌సీసీ క్యాడెట్లకు వివరించారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన యోగ క్లాస్‌లో యోగాగురు భగీరథి పాణి వివిధ రకాల యోగ విన్యాసాలు నిర్వహించి, వాటి వలన కలిగే ఉపయోగాలను వివరించారు. యోగాతో శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందని శిక్షణ కేంద్ర కెప్టెన్ కమాండెంట్ ప్రీతి రంజన్ దాస్ తెలియజేశారు. ఇన్‌స్పెక్టర్ ఆదిత్య దాస్ అతడి టీమ్ అగ్నితో పలు విన్యాసాల్లో ఎన్‌సీసీ క్యాడర్‌కు శిక్షణ ఇచ్చారు.

వైభవంగా నీలమ్మ తల్లి ఉత్సవాలు



తెలుగు చాకలి వీధి వద్ద కొలువైన జడ్డెమ్మ అమ్మవారు



జడ్డెమ్మకు గజనెయ్యి ముద్దను సమర్పిస్తున్న భక్తురాలు



కాపువీధి నుంచి నీలమ్మ గుడికి వెళ్తున్న మహిళలు

స్థానిక మూడో వార్డు కాపువీధిలో గ్రామ దేవత నీలమ్మ తల్లి ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా మహిళలు పెద్ద ఎత్తున ముర్రాటలు పట్టుకొని కాలేజీ రోడ్డులో ఉన్న గ్రామదేవత నీలమ్మ గుడికి వెళ్లి చల్లదనం చేశారు. మొత్తం మూడు రోజుల పాటు అమ్మవారి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సేరివీధిలో కూడా ఆదివారం నుంచి అమ్మవారి సంబరాలు జరుగుతున్నాయి. అదేవిధంగా 14వ వార్డు రాయిచెట్టు జంక్షన్ వద్ద ఉన్న జడ్డెమ్మ మందిరంలో వార్షిక ఉత్సవాలు ప్రారంభించారు.

– పర్లాకిమిడి

క్లుప్తంగా

ఫలితాల్లోనూ ఒకేలా..!

- కవల అక్కాచెల్లెల్లుకు సమాన మార్కులు



కవల సోదరీమణులు

భువనేశ్వర్: కవలలు ఒకే రూపు రేఖలతో తారసపడడం సర్వ సాధారణమైన విషయం. కానీ ఒకేసారి రాసిన బోర్డు పరీక్షల్లో ఒకేలా మార్కులు సాధించడం గమనార్హం. రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు (బీఎస్ఈ) ఇటీవల ప్రకటించిన పదో తరగతి వార్షిక పరీక్షల్లో గంజాం జిల్లాకు చెందిన కవల సోదరీమణులు సమాన మార్కులు సాధించారు. వీరివురు గంజాం జిల్లా బలుగాంవ్ సరస్వతి శిశు మందిర్ విద్యార్థులు. కవల సోదరీమణులు కరీనా, కరిష్మా బిస్వాల్ పదో తరగతి పరీక్షల్లో 552/600 మార్కులు సాధించి ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యపరిచారు. అత్యంత ఆసక్తికరమైన విషయం ఏమిటంటే వీరిద్దరూ హిందీలోనూ 99 మార్కులు సాధించారు. వీరి తల్లిదండ్రులు కార్తీక్ సాహు, జును సాహు మాట్లాడుతూ.. గతంలో కూడా పాఠశాలలో ఒకే విధమైన మార్కులు సాధించారన్నారు.

ఉచిత వైద్య శిబిరం



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్

జయపురం: స్థానిక మహారాణిపేటలోని కళింగ వైశ్యుల ఆరాధ్య దైవం కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో జయపురం కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరం సాయి స్పెషాలిటీ ఆస్పత్రి డాక్టర్లు సుమారు 180 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడు వారణాసి సత్యనారాయణ, కార్యదర్శి పోలాకి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా పశువులకు టీకాలు



కోటబొమ్మాళిలో సమీక్ష చేస్తున్న జిల్లా వెటర్నరీ ఇన్‌చార్జి జేడీ జయరాజ్

కోటబొమ్మాళి: జిల్లా వ్యాప్తంగా ఆర్‌బీకేల ద్వారా శరవేగంగా పాడి పశువులకు జబ్బవాపు, చిటుక వ్యాధి నివారణకు టీకాలను వేయిస్తున్నట్లు జిల్లా వెటర్నరీ జాయింట్ డైరెక్టర్ (ఎఫ్ఏసీ) వి.జయరాజ్ తెలిపారు. ఆయన మంగళవారం కోటబొమ్మాళి వెటర్నరీ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందితో సమీక్ష చేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. రానున్న వర్షాకాల సీజన్‌లో పాడి పశువులకు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తుగా వ్యాధి నివారణ టీకాలను వేస్తున్నామని వివరించారు. ఇప్పటివరకూ పాడి పశువులకు జబ్బవాపు నివారణకు 68,905 టీకాలు, మేకలు, గొర్రెలకు చిటుక వ్యాధి నివారణకు 2,99,189 టీకాలు వేశామని, ఇప్పటి వరకూ 90శాతం మేర వ్యాక్సినేషన్ పూర్తి చేశామని, ఈ నెలాఖరు నాటికి 100 శాతం పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పాడి రైతులు పశువులకు వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే పశు వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి వెటర్నరీ ఏడీ మంద మంద లోకనాథం, కురుదు పసువైద్యుడు లఖినేని కిరణ్‌కుమార్, ఎం.ప్రద్యుమ్నచైతన్య, వెటర్నరీ సహాయకులు ఎస్.శాంతారావు, కోట ధర్మారావు పాల్గొన్నారు.

చిన్నారిపై లైంగికదాడికి యత్నం.. కేసు నమోదు

పొందూరు: మండలంలోని ఒక గ్రామంలో ఐదేళ్ల చిన్నారిపై జరిగిన లైంగిక దాడి యత్నం కేసులో చిన్నారి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వై.రవికుమార్ తెలిపారు. సోమవారం రాత్రి ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తక్షణ నివేదికలు అందించండి

ఈ లైంగిక దాడికి యత్నం కేసుపై శ్రీకాకుళం పోలీసు ఉన్నతాధికారులు ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు తక్షణ నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేసినట్లు కమిషన్ సభ్యులు గొండు సీతారాం చెప్పారు. ఈ మేరకు మంగళవారం ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. ఈ వ్యవహారంపై నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లను పట్టించుకోకుండా నిందితుడిని అదుపులోకి తీసుకోవాలని తెలిపారు. పోలీసు శాఖ అందించే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలకు కమిషన్ సిఫారసు చేయనున్నట్లు తెలిపారు.

భారీగా గంజాయి స్వాధీనం



పట్టుబడిన నిందితులు

జయపురం: స్థానిక ఎక్సైజ్ అధికారులు 22 కేజీల 100 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ అధికారి నీలాద్రి బిహారి మిశ్ర వెల్లడించారు. ఈ సంఘటనలో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. పట్టుబడిన నిందితులు కొరాపుట్ జిల్లా కొలాబ్ నగర్‌కు చెందిన అభినాగ్, కేరళ రాష్ట్రానికి చెందిన నిశాన్ మాలడిన్, ఖబాధర్ ఫసులుద్దీన్, అరసాద్ హుసేన్‌లుగా ధ్రువీకరించారు. ముందుగా అందిన సమాచారం మేరకు సోమవారం సాయంత్రం జయపురం ఎక్సైజ్ విభాగ అధికారి నీలాద్రి బిహారి మిశ్ర నేతృత్వంలో ఏఎస్ఐ ఎం.లక్ష్మణరావుతో పాటు పలువురు సిబ్బంది విజయవాడ- రాంచీ 326వ జాతీయ రహదారి పాత్రోపుట్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో ఒక ఆటో వస్తుండగా అనుమానం వచ్చి సోదాలు చేపట్టారు. దీంతో ఒక సూట్‌కేస్‌లో గంజాయి పట్టుబడింది. తాము గంజాయిని లమతాపుట్ నుంచి తీసుకొస్తున్నట్లు నిందితులు తెలిపినట్లు వెల్లడించారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భానుడి భగభగ



రోహిణి కార్తె ఎండల ప్రభావం వలన పర్లాకిమిడిలో తీవ్ర ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. పట్టణంలో మంగళవారం 42 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 10 గంటలకే ఎండ ప్రభావంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఈనెల 31 వరకు అధిక ఎండలు, ఉక్కపోత వంటి ఇదే పరిస్థితి ఉంటుందని గోపాల్‌పూర్ ఐఎండీ అధికారులు తెలియజేశారు.

\- పర్లాకిమిడి

అగ్ని గంగమ్మ ఉత్సవాలు ప్రారంభం



కొలువుదీరిన అగ్ని గంగమ్మ



అమ్మవారిని ఆహ్వానిస్తున్న భక్తులు



అమ్మవారి సాంప్రదాయ ఆయుధాలకు పూజలు

కొరాపుట్: జిల్లాలోని సిమిలిగుడలో కొలువుదీరిన అగ్ని గంగమ్మ ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం రాత్రి అమ్మవారిని సాంప్రదాయ రీతిలో బయటకు తీసుకొచ్చారు. దీంతో తల్లి తన పుట్టింటికి వెళ్లింది. మంగళవారం పుట్టింటికి సమీపంలో ఉన్న పందిరి వద్ద కొలువుదీరింది. ఈ ఉత్సవాలు నవరాత్రులు జరుగుతాయి. ప్రతి వీధిలో అమ్మవారి రాకను ఆహ్వానిస్తూ ప్రజలు అలంకారాలు చేశారు. కొన్నిచోట్ల బొగ్గులు మండించి నిప్పులు తయారు చేశారు. వీటిపై నుంచి ఘటాలు నడవనున్నాయి. జూన్ 5వ తేదీన ఈ ఉత్సవాలు ముగియనున్నాయి. తొలిరోజు కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పాడాల్, పొట్టంగి ఎమ్మెల్యే పీతం పాఢీ, మాజీ ఎమ్మెల్యే ప్రఫుల్ల పంగి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపుల పరిశీలన



కొత్తూరు: కొత్తూరు మండలం ఆకులతంపర వద్ద ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న అధికారులు బృందం

కొత్తూరు: మండలంలోని వంశధార నదిలో అంగూరు, ఆకులతంపర, మాతల, నివగాం ఇసుక ర్యాంపులను మైన్స్ డీడీ సత్యనారాయణ ఆధ్వర్యంలో పలు శాఖలకు చెందిన అధికారుల బృందం మంగళవారం పరిశీలించింది. ఇసుక ర్యాంపులు నిర్వహణపై సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఇసుక ర్యాంపులు పరిశీలించినట్లు డీడీ చెప్పారు. నివగాం ఇసుక ర్యాంపునకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయన్నారు. అయితే ఈ ర్యాంపులో ఇసుక తవ్వకాలు మాన్యువల్‌గా చేయాలి తప్ప యంత్రాలతో ర్యాంపులు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. మిగిలిన ర్యాంపుల్లో ఇసుక తవ్వకాలకు ప్రభుత్వ అనుమతులు లేవని చెప్పారు. ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఇసుక ర్యాంపులు నిర్వహిస్తే కోర్టు ఆదేశాల మేరకు ప్రతి వారం నియమించిన బృందం తనిఖీలు నిర్వహించి నివేదికను ప్రభుత్వానికి నివేదిస్తుందని తెలిపారు. ర్యాంపులు వద్ద ఇసుక తవ్వకాలు చేయరాదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. తనిఖీల్లో సెబ్ స్టేషన్ సీఐ బి.జయరామరెడ్డి, ఇరిగేషన్ ఏఈఈ రామకృష్ణప్రసాద్, ఏఈఈ మణికంఠ, అసిస్టెంట్ హైడ్రో జియాలజిస్టు జి.త్రివేణి, ఎస్ఐ ఏంఏ హమ్మద్ ఆర్ఐ లక్షణరావు, వీఆర్వో శంకర్, రాజగోపాలరావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

లారీ బోల్తా డ్రైవర్‌కు గాయాలు



జాతీయ రహదారిపై బోల్తాపడిన లారీ

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై కేశవరావుపేట పంచాయతీ కింతలిమిల్లు సమీపంలో మంగళవారం లారీ అదుపు తప్పి బోల్తా పడింది. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా ఇనుప కంచెను ఈడ్చుకొని ముందుకు వెళ్లాడు. లారీ వేగానికి ఇనుక కంచె 10 మీటర్ల వరకు ధ్వంసమైంది. డ్రైవర్ వేగాన్ని నియంత్రించలేకపోవడంతో లారీ బోల్తా పడింది. ఘటనలో డ్రైవర్ ప్రమోద్ యాదవ్ గాయపడ్డాడు. స్థానికులు అతడిని 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. డ్రైవర్‌ది బీహార్ రాష్ట్రం నాగపూర్ ప్రాంతం. లారీ క్యాబిన్‌లో ఉన్న క్లీనర్ సురక్షితంగా బయట పడ్డాడు. పోలీసులు, హైవే సిబ్బంది సహాయ చర్యలు చేపట్టి, ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

సారా స్థావరాలపై పోలీసుల దాడులు



సవరకుడ్డబ గ్రామంలో సారా ఊట ధ్వంసం చేస్తున్న పోలీసులు

మెళియాపుట్టి: మండలంలోని రింపి గ్రామంలో డీటీఎఫ్, ఎస్ఈబీ, ఇంటెలిజెన్స్ బృందాలు సమన్వయంతో బుధవారం సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1100 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 45 లీటర్ల నాటు సారాని స్వాధీనం చేసుకున్నారు. ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. దాడుల అనంతరం ఆయా గ్రామాల ప్రజలకు నాటుసారా తయారీ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. సారా తయారీ, క్రయ విక్రయాలు మానుకోవాలని పిలుపునిచ్చారు. పలాస డీటీఎఫ్ సిఐ, రామచంద్ర కుమార్, టెక్కలి ఎస్ఈబి సిఐ రాజశేఖర్ నాయుడు, పలువురు సిబ్బంది ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



క్షేత్రస్థాయిలో అధికారులతో శ్రామిక్ కాంగ్రెసు ప్రతినిధులు

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే సిబ్బంది దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి శ్రామిక్ కాంగ్రెస్ నడుం బిగించింది. ఈనెల 28న ఖుర్దారోడ్ మండల అధికారులతో జరిగిన కాలానుగుణ చర్చల సమావేశం (పీఎన్ఎం)లో ప్రధాన కార్యదర్శి రమేష్ చంద్ర సాహు చర్చించారు. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారానికి యాజమాన్యంతో కుదిరిన ఒప్పంద తీర్మానాల వాస్తవ కార్యాచరణ ఆరంభమైంది. మండల రైల్వే అధికారులు సహాయ మండల ఇంజనీర్ డి.ప్రభాకర్‌రావు, సహాయ మండల సిగ్నల్ అండ్ టెలికాం ఇంజినీర్ జపానీ బెహెరా క్షేత్ర స్థాయిలో సిబ్బందితో ప్రత్యక్షంగా సంప్రదించి సత్వర పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఓపెన్ లైన్ మండల శాఖ కార్యదర్శి లక్ష్మీధర మహంతి శ్రామిక్ కాంగ్రెస్ ప్రతినిధిగా పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కోర్సులతో మెరుగైన ఉద్యోగావకాశాలు

ఆమదాలవలస రూరల్: పాలిటెక్నిక్ కోర్సులు చేసే విద్యార్థులకు మెరుగైన ఉద్యోగావకాశాలు లభిస్తాయని బీఎస్ఎన్ఎల్ జేటీఓ గురుగుబెల్లి శ్రీహరి అన్నారు. మండలంలో దన్నానపేట గ్రామం సమీపంలో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ అచీవర్స్ డేను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలకు చెందిన 41 మంది విద్యార్థులకు వివిధ సంస్థల్లో ఉద్యోగాలు రావడంపై అభినందనలు తెలియజేశారు. వారందరికీ నియామక పత్రాలు అందజేశారు. పాలిటెక్నిక్‌లో చేరిన విద్యార్థుల్లో నైపుణ్య కల్పన, ఉద్యోగ సాధనలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఉద్యోగం చేస్తూ ఉన్నత చదువులు చదువుకోడానికి అస్కారం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఎన్ఏసీఎల్ ఏజీఎం వీఆర్ పాండా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నెపు గోపి, ఎలక్ట్రానిక్ విభాగాధిపతి పి.శ్రీనివాస్, ఎమ్.మోహన్‌దాస్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌పై ఉద్యోగులకు శిక్షణ



మాట్లాడుతున్న కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్



శిక్షణ శిబిరంలో పాల్గొన్న ఉద్యోగులు

పర్లాకిమిడి: స్థానిక ఎస్‌కేసీజీ కళాశాలలో జూన్ 4న జరగనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌లో ప్రభుత్వ ఉద్యోగులు క్రమశిక్షణ, పారదర్శకతతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ సూచించారు. ఈ మేరకు కలెక్టరేట్ సమీపంలో ఉన్న గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రంలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియపై శిక్షణ శిబిరం మంగళవారం ఏర్పాటు చేశారు. రెండో విడత శిక్షణ జూన 2వ తేదీన పోలీసు అధికారులతో ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా మేజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్, సబ్ కలెక్టర్ అలోక్ పండా, ఎన్నికల డిప్యూటీ కలెక్టర్ కమలకాంత పండా తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు శ్రీకారం



పారిశుద్ధ్య పనులు చేపడుతున్న దృశ్యం

రాయగడ: రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని మున్సిపాలిటీ యంత్రాంగం పారిశుద్ధ్య మెరుగు పనులకు శ్రీకారం చుట్టింది. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో వర్షాకాలంలో మురుగు కాలువలు నిండి రోడ్లపై ప్రవహిస్తుంటాయి. అయితే ఈసారి ఆ సమస్య తలెత్తకుండా యంత్రాంగం అందుకు అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టింది. మున్సిపాలిటీ వార్డు పరిధిలోని మొత్తం 24 వార్డులను ఆరు జోన్‌లుగా విభజించింది. ఆయా జోన్‌లలో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరిచేవిధంగా 82 మంది సఫాయి కార్మికులను నియమించింది. వీరిని పర్యవేక్షించే విధంగా ఒక ప్రైవేట్ సంస్థకు బాధ్యతలను అప్పగించింది. దీంతో పట్టణంలోని ప్రధాన కూడళ్లతో పాటు వీధుల్లోని మురికి కాలువలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేస్తున్నారు. ఇదివరకు కాలువలు సకాలంలో పరిశుభ్రం చేయకపోవడంతో చెత్తచెదారాలు నిల్వ ఉండి వర్షాకాలంలో రోడ్లపైకి మురికి నీరు ప్రవహిస్తుండేది. ఇకపై ఆ సమస్య తలెత్తకుండా ముందుగానే యంత్రాంగం చర్యలు చేపట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హద్దు మీరితే అంతే..

- కౌంటింగ్ రోజు దుశ్చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు
- హింసాత్మక ఘటనల్లో పాల్గొన్న వారిపై రౌడీషీట్
- విజయోత్సవ ర్యాలీలు, ధర్నాలు రద్దు
- జిల్లా అంతటా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు
- శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసు యంత్రాంగం సమాయత్తం



ఎచ్చెర్ల శివానీ కళాశాల వద్ద కౌంటింగ్ భద్రతా ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీలు

శ్రీకాకుళం క్రైమ్ : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ సజావుగా ముగిసింది. ఇక కౌంటింగ్‌కు సమయం దగ్గర పడుతోంది. మరో ఐదు రోజుల్లో ఓట్ల లెక్కింపు (కౌంటింగ్) ప్రక్రియ మొదలు కానుండటంతో కౌంటింగ్ రోజు, కౌంటింగ్ అనంతరం ఎలాంటి అల్లర్లు, హింసాత్మక, అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ఎస్పీ జీఆర్ రాధిక నేతృత్వంలోని జిల్లా పోలీసు యంత్రాంగం సకల చర్యలు తీసుకుంటోంది. హద్దుమీరితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తోంది.

పటిష్ట భద్రత..

ఎచ్చెర్లలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో జూన్ 4 కౌంటింగ్ రోజున పటిష్ట భద్రతా ఏర్పాట్ల దృష్ట్యా కౌంటింగ్ కేంద్రాలు, అధికారులు, సిబ్బంది, ఏజెంట్లు వచ్చే మార్గాలు, వాహన పార్కింగ్, రూట్ మ్యాప్‌ను ఇప్పటికే పరిశీలన చేశారు. రెవెన్యూ, పోలీస్, ఫైర్ విభాగాలతో పాటు ఇతర శాఖల సమన్వయంతో ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా జరిగేలా మూడంచెల (వన్‌టైర్- కేంద్రబలగాలు, టూ టైర్- పారామిలిటరీ, త్రీ టైర్- సివిల్ పోలీసులతో) భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులకు కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌తో కలిసి ఎస్పీ రాధిక దిశానిర్దేశం చేశారు. ప్రతి రోజూ ఎస్పీ ఏదో ఒక సమయంలో ఎచ్చెర్ల శివానీ ఇంజినీరింగ్ కళాశాలకు వెళ్లి ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్‌లు భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్‌లను తనిఖీ చేసి అక్కడ పహారా కాస్తున్న గార్డ్ సిబ్బందిని అప్రమత్తం చేసి నిఘా పక్కాగా ఉండేలా చేస్తున్నారు. శాసనసభ, పార్లమెంటు స్థానాలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాల్లో ప్రత్యేక డ్రోన్లు ఏర్పాటు చేయడమే కాక అధిక సంఖ్యలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. రిటర్నింగ్ అధికారులు జారీ చేసిన అనుమతి పత్రాలున్న వారినే వీరు కౌంటింగ్ కేంద్రాలకు వదులుతారు.

మాక్ డ్రిల్.. సమావేశాలతో..

కేంద్ర బలగాలు స్థానిక పోలీసులతో కలసి జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే కార్డన్ సెర్చ్‌లు, ఫ్లాగ్‌మార్చ్‌ల రూపంలో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాక హింసాత్మక ఘటనలు చెలరేగితే పోలీసు చర్యలు ఎలా ఉంటాయన్నదానిపై ఇప్పటికే మాక్ ఆపరేషన్ మాక్ డ్రిల్స్ ద్వారా చూపిస్తున్నారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో ఆయా గ్రామాల్లో శాంతి కమిటీల ప్రతినిధుల, రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి ప్రశాంత కౌంటింగ్ జరిగేందుకు సహకరించాలని కోరుతున్నారు. అల్లర్లు చెలరేగే అవకాశం ఉండే టెక్కలి, పలాస వంటి నియోజకవర్గాల్లోని ముఖ్య కేంద్రాలు, అక్కడి సమస్యాత్మక గ్రామాల్లో రాత్రి వేళల్లో ఎస్పీ స్వయంగా సందర్శించి సమావేశాలు పెట్టి ప్రజలను చైతన్యపరుస్తున్నారు.

ర్యాలీలు, ధర్నాలకు చెక్..

ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక గెలిచిన అభ్యర్థులు విజయోత్సవ ర్యాలీలు చేసినా.. ఫలితం తారుమారై ఓటమిపాలైన నేతల అనుచరగణం, కార్యకర్తలు రోడ్లపై ధర్నాలకు దిగినా సహించేది లేదని పోలీసులు చెబుతున్నారు. డీజేలతో సంబరాలు, బాణాసంచా విక్రయాలు, పెట్రోలు బంకుల్లో లూజు పెట్రోలు విక్రయాలకు ఎన్నికల కోడ్ ఉన్నందున జూన్ 6 వరకు అనుమతి లేదంటున్నారు. ద్విచక్రవాహనాలకు సైలెన్సర్లు తీసేసి పెద్ద శబ్దంతో వాహనాలు నడపరాదని అన్నారు. అవాంఛనీయ, హింసాత్మక ఘటనలు, సంఘ విద్రోహక శక్తులు, సోషల్ మీడియా వేదికలపై పోస్టులు చేసినా ఉపేక్షించేది లేదంటున్నారు.

విధ్వంసాలకు పాల్పడితే..

ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉండటమే కాక 30 పోలీస్ యాక్ట్ కూడా ఉంది. ఈ క్రమంలో అధిక సంఖ్యలో గుమిగూడి ప్రజలు ఎవ్వరా ఉండరాదని, ధర్నాలు, దొమ్మీ కొట్లాటలు జరిగిన చోట ఆ పరిధి ఎస్‌హెచ్ఓ బాధిత సిబ్బంది నిరోధిస్తారు. మరో పెద్ద గొడవ జరిగితే కేంద్ర బలగాలు, పారా మిలిటరీ, ఆర్మ్‌డ్ రిజర్వ్ దళాలు రంగంలోకి దిగి కంట్రోల్‌లోకి తెస్తాయి. ఘటనల్లో పాల్గొన్నవారిపై కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తారు. గొడవలు జరుగుతాయన్న సమాచారం ఉంటే ముందస్తు అరెస్టులు చేయడం.. హింసాత్మక ఘటనలకు, విధ్వంసాలకు కారణమైన వారిపై రౌడీషీట్లు తెరిచి జైలుకు పంపించే అవకాశం ఉంది. మద్యం విక్రయాలు కూడా తమ నియంత్రణలో ఉండేటట్లు పోలీసులు చూసుకుంటున్నారు.

కౌంటింగ్ అనంతరం..

కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం అల్లర్లు చెలరేగే అవకాశం ఉన్నందున ముందుగా గుర్తించిన అలాంటి ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటుచేస్తారు. ఇప్పటికే గుర్తించిన ట్రబుల్ మాంగర్స్‌కు నోటీసులిచ్చి వారిపై ప్రత్యేక నిఘా పెట్టారు. గొడవలకు దిగే రౌడీషీటర్లను, అనుమానితులపై బైండోవర్ చేశారు. జిల్లాలోని ప్రతీ పీఎస్ పరిధి రౌడీషీటర్లకు పోలీసులు రెండుసార్లు కౌన్సిలింగ్ కూడా ఇచ్చారు. అయినప్పటికీ నాయకుల అండ చూసి అల్లర్లకు దిగితే జైలు పాలవ్వడం తప్పదంటున్నారు పోలీసులు.

క్లుప్తంగా

రోగులకు మెరుగైన వైద్యసేవలు

● జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ విజయపార్వతి



ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీస్తున్న డీఎంహెచ్‌వో విజయపార్వతి

గరుగుబిల్లి: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో(జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ విజయపార్వతి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని రావివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె మంగళవారం సందర్శించి, అక్కడి రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైద్యం కోసం ఆస్పత్రిని ఆశ్రయించే ప్రతీ రోగికి సకాలంలో సేవలు అందేలా చూడాలని, ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. గర్భిణులు, బాలింతలకు నిర్దేశిత సమయాల్లో వైద్య తనిఖీలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు, ఆరోగ్య సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆమె వెంట వైద్యాధికారి కె.కార్తీక్ తదితరులు ఉన్నారు.

ఇద్దరికి గాయాలు

గరుగుబిల్లి: మండలంలోని సుంకి గ్రామ మలుపు వద్ద రెండు బైక్‌ల ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. పార్వతీపురం నుంచి గుమ్మలక్ష్మీపురం దగ్గరున్న ఎల్విన్‌పేటకు భార్యాభర్తలు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం .. ఖడ్గవలస నుంచి నవిరి వైపు వెళ్తున్న యువకుల బైక్ అదే దారిలో ఒకదానికొకటి ఢీకొన్నాయి. దీంతో ఆ రెండు బైక్‌లు నడుపుతున్న వారికి మాత్రమే గాయాలైనట్లు సమాచారం. స్థానికుల సహాయంతో 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి క్షతగాత్రులను తరలించారు.

గజపతినగరం: ద్విచక్ర వాహనం పైనుంచి జారిపడి మెంటాడ మండలం, రాబంద గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళకు గాయాలయ్యాయి. మంగళవారం ఉదయం గజపతినగరంలో నిత్యవసర సరుకులు కొనుగోలు చేసుకుని, తన అల్లుడితో కలిసి బైక్‌పై ఆమె స్వగ్రామం వెళ్తుండగా, ప్రమాదానికి గురైంది. చికిత్స నిమిత్తం గజపతినగరం ఏరియా ఆస్పత్రికి ఆమెను తరలించి, వైద్యసేవలు అందించారు. మెరుగైన వైద్యం కోసం విజయనగరం సర్వజన ఆస్పత్రికి ఆమెను తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

బొబ్బిలి: మండలంలోని కలువరాయి సుభద్ర జంక్షన్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తొనంగి సాయి అనే యువకుడు దుర్మరణం చెందగా, మరో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.. బొబ్బిలి మండలం, రాముడువలసకు చెందిన తొనంగి సాయి, మెట్టవలస గ్రామానికి పువ్వల వంశీ, మక్కువ మండలం, పెద్దవలస గ్రామానికి చెందిన సుబ్బారావు గాయత్రి డిగ్రీ కళాశాలలో చదువుతున్నారు. ఈ ముగ్గురూ గొంగాడవలస గ్రామదేవత పండగకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. సరిగ్గా కలువరాయి సుభద్ర జంక్షన్ వద్దకు వచ్చేసరికి వీరి బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న దుకాణాన్ని ఢీకొన్నారు. దీంతో బైక్‌పై ఉన్న ముగ్గురిలో సాయి అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మృతుడి గ్రామం రాముడువలసలో విషాద ఛాయలు అలముకున్నాయి.

వ్యక్తి మృతి

బొండపల్లి: గొట్లాం బైపాస్ రోడ్డులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహంతి అప్పలనాయుడు(48) అనే వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ కె.లక్ష్మణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. అంబటివలస గ్రామానికి చెందిన అప్పలనాయుడు.. గుంకలాం గ్రామం నుంచి తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామం వెళ్తుండగా అతడి బైక్‌ను లారీ ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే తీవ్రగాయాలపాలై, మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం విజయనగరంలోని సర్వజన ఆస్పత్రికి మృతదేహం తరలించారు.

సీతంలో ఎన్‌సీసీ వార్షిక శిక్షణ



శిక్షణలో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్స్

విజయనగరం అర్బన్: గాజులరేగలోని సీతం కళాశాలలో ఎన్‌సీసీ 2(ఎ) గర్ల్స్ బెటాలియన్ శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. క్యాంప్ కమాండింగ్ ఆఫీసర్ కల్నాల్ గోపేంద్ర పర్యవేక్షణలో 10 రోజుల పాటు ఈ శిక్షణ జరుగుతుందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యువత భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని దేశ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. శిబిరంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ కెప్టెన్ మీసాల సత్యవేణి, సుబేదార్ మేజర్ బొడ్డే, పరమేశ్వర్ సింగ్, అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్స్ లెఫ్టినెంట్ మజ్జి వరలక్ష్మి, థర్డ్ ఆఫీసర్ వెంకట రత్నం, లెఫ్టినెంట్ సంతోషి, థర్డ్ ఆఫీసర్ ఎ.వరలక్ష్మి, తులసి, లక్ష్మీప్రసన్న, గౌరి, వెంకట రమణమ్మ, ధనశ్రీ విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వచ్చిన 600 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు.

గడువు దాటితే ముప్పే



- వంటగ్యాస్ సిలిండర్‌కు పదేళ్ల కాలపరిమితి
- గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి
- డిస్ట్రిబ్యూటర్లు సైతం నిబంధనలు పాటించాలి
- జిల్లాలో 32 ఏజెన్సీల్లో 6.28 లక్షల మంది గ్యాస్ వినియోగదారులు



రామభద్రపురంలో గ్యాస్ సిలిండర్లు డెలివరీ చేస్తున్న సిబ్బంది

రామభద్రపురం: గ్యాస్ సిలిండర్‌తో వంట ఎంత సులువో జాగ్రత్తలు పాటించకపోతే అంతే ప్రమాదమని అధికారులు హెచ్చరిస్తున్నారు. తరచూ గ్యాస్‌ను గమనిస్తుండాలని, గడువు తేదీ ముగిసిన సిలిండర్‌ను వినియోగిస్తే గ్యాస్ లీకయ్యే ప్రమాదం ఉందని చెబుతున్నారు. వంటగ్యాస్ కంపెనీలు సరఫరా చేసే ప్రతీ సిలిండర్‌పై గడువు తేదీ కోడ్ విధానంలో మెటల్ ప్లేట్‌పై ముద్రిస్తాయి. సిలిండర్‌ను మార్చుతున్నప్పుడల్లా ఆ గడువు తేదీని చూసుకుని, వినియోగించాలి. జిల్లాలో ఇండేన్, హెచ్‌పీ, బీపీఎస్ ఇలా 32 ఏజెన్సీలు గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తుండగా, ఆయ ఏజెన్సీల పరిధిలో 6.28 లక్షల మంది వినియోగదారులు ఉన్నారు.

గుర్తించాల్సిన విషయాలు..

ఉదాహరణకు సిలిండర్ మెటల్ ప్లేట్‌పై ఏ–24 అని ఉంటే 2024 జనవరి నుంచి మార్చి వరకు, బి–24 ఉంటే ఏప్రిల్ నుంచి జూన్ వరకు, సి–24 అని ఉంటే జూలై నుంచి సెప్టెంబర్ వరకు, డి–24 అని ఉంటే అక్టోబరు నుంచి డిసెంబరు వరకు గడువు ఉన్నట్లు అని గుర్తించాలి. సిలిండర్ ఇంటి వద్దకు డెలివరీ అయిన వెంటనే మెటల్ ప్లేట్‌పై కోడ్ విధానంలో ఉన్న గడువు తేదీని గుర్తించాలి. గడువు తేదీ నెల వ్యవధిలో ముగుస్తున్నట్లు సిలిండర్‌పై ఉంటే దాన్ని తీసుకోకూడదు. ఎందుకంటే చిన్న కుటుంబాల వారికి నెలరోజులకు పైగా గ్యాస్ వస్తుంది. ఆ సిలిండర్ స్థానంలో వేరే సిలిండర్‌ను అడిగి తీసుకునే హక్కు వినియోగదారుడికి ఉంది.

పరిశీలించి, ఇస్తే బాగుంటుంది..



చదువు రాని మాలాంటి ఎంతోమందికి గ్యాస్ సిలిండర్ కాలపరిమితి తేదీ చూడడం తెలీదు. గ్యాస్ గొడౌన్ వద్ద నుంచి సిలిండర్ వాహనం ద్వారా పంపిస్తున్నప్పుడే ఆ తేదీ పరిశీలించి, ఇస్తే బాగుంటుంది. గ్యాస్ ఏజెన్సీ వారే ఈ పని చేస్తే మాకు ఇబ్బంది ఉండదు.

–ఎస్.లక్ష్మి, గ్యాస్ వినియోగదారు, రామభద్రపురం.

బీఐఎస్ ప్రమాణాల మేర..

సిలిండర్ తయారైనప్పటి నుంచి పదేళ్ల వరకు గడువు ఉంటుంది. సిలిండర్‌ను ప్రత్యేకమైన ఉక్కుతో సిలిండర్ లోపల సురక్షతమైన కోటింగ్‌తో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) ప్రమాణాల మేరకు తయారు చేస్తారు. బీఐఎస్ అనుమతుల తరువాతే సిలిండర్ మార్కెట్‌లోకి వస్తుంది.

వినియోగదారుడి హక్కులు..

గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు కొన్ని హక్కులు ఉంటాయి. గ్యాస్ కనెక్షన్ కలిగిన వినియోగదారు మృతి చెందితే వారి కుటుంబ సభ్యుల

నిబంధనలు అతిక్రమిస్తే అనుమతులు రద్దు..



గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు నిబంధనలు అతిక్రమిస్తే అనుమతులు రద్దు చేస్తాం. గ్యాస్ వ్యాపార స్థలం వద్ద నుంచి 15 కిలోమీటర్ల పరిధిలో నివశించే వినియోగదారుల ఇళ్ల వద్దకు సిలిండర్లు డెలివరీ చేసేందుకు అదనపు చార్జీలు వసూలు చేయకూడదు. గ్యాస్ డెలివరీ సమయంలో డెలివరీ సిబ్బంది వేవింగ్ స్కేల్, లీక్ టెస్టర్ వెంట తీసుకువెళ్లి, వినియోగదారుల సమక్షంలో టెస్ట్ చేసి ఇవ్వాలి.

– కె.మధుసూదన్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి, విజయనగరం.

పేరిట ఆ కనెక్షన్ మార్చుకోవచ్చు. అలాగే కొత్త కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే నిబంధనల మేరకు ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే అదేరోజు కనెక్షన్ పొందవచ్చు. కొత్త కనెక్షన్ తీసుకునే సమయంలో తమ వద్దనే స్టవ్ కొనుగోలు చేయాలని డీలర్ కోరవచ్చు. అయితే డీలర్ వద్దనే స్టవ్ కొనుగోలు చేయాలన్న నిబంధన ఏమీ లేదు. దీంతో పాటు గ్యాస్ ఏజెన్సీ నుంచి 5 కిలోమీటర్ల పరిధిలోని వినియోగదారులకు సిలిండర్ ఉచితంగా డోర్ డెలివరీ చేయాల్సి ఉంటుంది. ఇన్సూరెన్స్ కోసం వినియోగదారులంతా గ్యాస్ యాజమాన్యాన్ని కలిసి పేర్లు నమోదు చేయించుకోవాలి.

తిరుమల శ్రీవారి సేవలో డిప్యూటీ స్పీకర్



తిరుమల తిరుపతి దేవస్థానంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తదితరులు

విజయనగరం: తిరుమలలో కొలువైన కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామిని శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మంగళవారం దర్శించుకున్నారు. తన పుట్టినరోజు సందర్భంగా సతీసమేతంగా శ్రీవారి సన్నిధికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికి, అర్చకులతో స్వామి వారి ఆశీర్వచనాలు అందజేశారు. స్వామి వారి శేషవస్త్రాన్ని స్వీకరించిన అనంతరం మీడియాతో డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ శ్రీవేంకటేశ్వరస్వామి కృపాకటాక్షాలు ప్రజలందరిపైనా ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆ భగవంతుడిని వేడుకున్నట్లు తెలిపారు. అలాగే స్వామి వారి ఆశీర్వాదంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి అవుతారని, ఆయననే మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని శ్రీవారిని కోరుకున్నానన్నారు. అంతకుముందు కోలగట్ల తన కుటుంబ సభ్యుల మధ్య కేక్ కట్ చేసి, అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో కోలగట్ల వీరభద్రస్వామి సతీమణి రమణి, పార్టీ నాయకులు జి.శ్రీనివాస్, పైడితల్లమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు ఎం.కె.బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అనాథలను చిల్డ్రన్స్ హోమ్‌లో చేర్పించండి



చిల్డ్రన్స్ హోమ్ సేవలపై అవగాహన కల్పిస్తున్న డీసీపీయూ కౌన్సిలర్ తవిటినాయుడు

గుమ్మలక్ష్మీపురం: అనాథ పిల్లలను పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్స్ హోమ్‌లో చేర్పించాలని డీసీపీయూ కౌన్సిలర్ తవిటినాయుడు కోరారు. ఇదే విషయమై మండలంలోని భద్రగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో మంగళవారం సమావేశమైన ఆయన.. చిల్డ్రన్స్ హోమ్ సేవలు, నిర్వహణ, చిల్డ్రన్స్ హోమ్‌లో పిల్లల అడ్మిషన్లపై అవగాహన కల్పించారు. ఐదేళ్లలోపు అనాథ పిల్లలను, తల్లీ లేదా తండ్రిని కోల్పోయిన పిల్లలను చిల్డ్రన్స్ హోమ్‌లో చేర్పిస్తే వారికి విద్యతో పాటు వసతి, భోజనం సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. తల్లిదండ్రులు ఉండి చదువుకునే స్తోమత లేని పిల్లలను కూడా చిల్డ్రన్స్ హోమ్‌లో చేర్పించుకుంటున్నామన్నారు. ఎక్కడైనా అనాథ పిల్లలు ఉంటే వారి వివరాలు సేకరించి, తమకు సమాచారం ఇవ్వాలని, చిల్డ్రన్స్ హోమ్ ద్వారా వారి బంగారు భవిష్యత్ అందిస్తామన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీదేవి, ఈశ్వరమ్మ, ఉనీష తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో విలువైన కోర్సులు అందించడమే లక్ష్యం

● జీఏడీ కార్యదర్శి, కాలేజీయేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్



మాట్లాడుతున్న కాలేజీయేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ భాస్కర్

చీపురుపల్లి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ఉపయోగపడే విలువైన కోర్సులు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని జీఏడీ కార్యదర్శి, కాలేజీయేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ తెలిపారు. స్థానిక పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో జోన్–1 పరిధిలోని ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉన్న 40 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు చెందిన ప్రిన్సిపాళ్లతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఆయన.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఉన్న గ్రూపుల ఆధారంగా కళాశాలలను మూడు కేటగిరీలుగా విభజించినట్లు తెలిపారు. పది కంటే ఎక్కువ గ్రూపులు ఉన్న కళాశాలలను కేటగిరీ–1 గాను, ఐదు నుంచి పది గ్రూపులు ఉన్న కళాశాలలను కేటగిరీ–2 గాను, అంతకంటే తక్కువ గ్రూపులు ఉన్న కళాశాలలను కేటగిరీ–3 గాను విభజించినట్లు చెప్పారు. ఆయా కళాశాలల్లో రానున్న విద్యా సంవత్సరంలో ఎలాంటి కోర్సులు కొనసాగించాలి, ఇంకా ఎలాంటి కోర్సులు అవసరం ఉంది, కోర్సులకు అనుగుణంగా ఫ్యాకల్టీ ఎంత అవసరమనే విషయాలను చర్చించుకుని, ప్రభుత్వానికి ప్రతిపాదనలను నివేదించేందుకే ఈ సమీక్ష చేపట్టామన్నారు. డిగ్రీలో ఫస్టియర్‌లో చేరే విద్యార్థులు మూడేళ్ల పాటు కోర్సులో కొనసాగాల్సి ఉంటుందని, ఈ నేపథ్యంలో మధ్యలో ఎలాంటి మార్పులు లేకుండా విద్యా సంవత్సరం ఆరంభంలోనే అవసరమైన మార్పులు చేర్పులు చేసుకుని, మూడేళ్ల కోర్సు నిరంతరాయంగా జరగాలన్నారు. 2025–26 విద్యా సంవత్సరంలో ఎలాంటి కొత్త విధానాలు అమలు చేయాలన్నా ఇప్పుడే నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఆర్ట్స్, సైన్స్, కంప్యూటర్ గ్రూపులకు సంబంధించి కొత్త కోర్సులు కావాలన్నా, అధ్యాపకులు అవసరమైనా, సిబ్బంది అవసరమైనా ఇప్పుడే ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. విద్యార్థులు ఏ రకమైన కోర్సులపై ఆసక్తి చూపిస్తున్నారో వాటినే అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సంప్రదాయంగా వస్తున్న కోర్సులపై విద్యార్థులు ఆసక్తి కనబరచకపోతే వాటిని తొలగించాలన్నారు. కార్యక్రమంలో కాలేజీయేట్ ఎడ్యుకేషన్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ డా.ఎస్.శోభారాణి, అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డా.తులసీ మస్తానమ్మ, కళాశాల ప్రిన్సిపాల్ డా.పివి.కృష్ణాజీ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు సిద్ధం

- ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం
- పటిష్ట బందోబస్తు ఏర్పాటు
- జిల్లాలో 144 సెక్షన్ అమలు
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్ కుమార్



అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, అరకు పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నిషాంత్‌కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశమైన ఆయన.. అరకు పార్లమెంట్, నాలుగు శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించి, జూన్ 4వ తేదీన ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. అయితే పోస్టల్ బ్యాలెట్‌ను ఈవీఎం లెక్కింపునకు అరగంట ముందు(7.30 గంటలకు) ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈవీఎం ఓట్ల లెక్కింపునకు 8 కౌంటింగ్ హాల్స్, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ఒక కౌంటింగ్ హాల్ ఏర్పాటు చేశామన్నారు. ఈవీఎం లెక్కింపునకు ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు 14 టేబుళ్లు, పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు 20 టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు ప్రతీ టేబుల్ వద్ద ఒక జిల్లా స్థాయి అధికారిణి సహాయ రిటర్నింగ్ అధికారిగా, ఒక గెజిటెడ్ అధికారి, ఇతర సిబ్బంది ఉంటారన్నారు. శాసనసభ నియోజకవర్గ లెక్కింపులో రిటర్నింగ్ అధికారి వేదిక వద్ద రెండు టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు ఏర్పాట్లు చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు వద్ద అభ్యర్థి గానీ, ప్రధాన ఏజెంట్ గానీ ఉండవచ్చన్నారు.

ప్రతీ టేబుల్ వద్ద మైక్రో అబ్జర్వర్..

ఈవీఎం ఓట్ల లెక్కింపు టేబుల్ వద్ద ఒక్కొక్క ఏజెంట్ ఉండవచ్చన్నారు. ప్రతీ టేబుల్ వద్ద ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని, రిటర్నింగ్ అధికారి వేదిక వద్ద పోస్టల్ బ్యాలెట్ లెక్కింపులో ఇద్దరు మైక్రో అబ్జర్వర్లు ఉంటారని, మొత్తం 200 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించడం జరిగిందన్నారు. స్ట్రాంగ్ రూమ్ తెరిచేందుకు ఏజెంట్లు ఉదయం 6.30గంటలకు లెక్కింపు కేంద్రానికి హాజరు కావాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. ఏజెంట్లు పెన్ను, పెన్సిల్, 17సి ఫారం, తెల్లకాగితం మాత్రమే తీసుకురావాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. లెక్కింపు కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. 158 సీసీ కెమెరాలు, రెండు డ్రోన్లు నిరంతర నిఘాలో ఉంటాయన్నారు. పోలీసు సూపరింటెండెంట్ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ లెక్కింపు కేంద్రంలోనికి ప్రవేశించే వారికి విధిగా పాస్ ఉండాలన్నారు. వాహనాలను నిర్దేశిత ప్రాంతంలోనే నిలుపుదల చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు అనంతరం ప్రశాంత వాతావరణానికి సహకరించాలన్నారు. సమావేశంలో జేసీ ఎస్ఎస్ శోబిక, ఎస్‌డీసీ ఆర్‌వీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం అర్బన్: సూచనలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ దీపికా పాటిల్ మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా జరిగేలా సహకరించాలని కోరారు. అనంతరం పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం ఓట్ల లెక్కింపు, కౌంటింగ్ టేబుళ్ల ఏర్పాటు, సిబ్బంది నియామకం, ఏజెంట్లు, అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలు, చట్టపరమైన అంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు. ఈవీఎంలోని ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించడానికి వేర్వేరుగా లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ఈవీఎం ఓట్ల లెక్కింపు కోసం ప్రతీ కేంద్రంలో 14 టేబుళ్ల చొప్పున, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం 4 టేబుళ్ల చొప్పున, ఈటీపీబీఎంఎస్ ఓట్ల లెక్కింపు కోసం అదనంగా మరో టేబుల్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విజయనగరం పార్లమెంట్‌కు పోలైన పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కోసం లెండి కళాశాలలో 20 టేబుళ్లతో మరో లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, నిబంధనల ప్రకారం ప్రతీ టేబుల్ దగ్గర ఒక కౌంటింగ్ ఏజెంట్‌ను నియమించుకునే అవకాశం అభ్యర్థులకు ఉందన్నారు. వీరు కాకుండా ఆర్‌వో దగ్గర అభ్యర్థి లేదా జనరల్ ఏజెంట్ కూర్చొనే అవకాశం ఉందన్నారు. కౌంటింగ్‌కు మూడు రోజుల ముందుగానే ఫారం 18 ద్వారా ఏజెంట్ల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్పీ దీపికా పాటిల్ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాలతో పాటు ఆ పరిసర ప్రాంతాల్లో కూడా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని, ఫలితాల తర్వాత ఊరేగింపులు, ర్యాలీలు చేయాలంటే తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డీఆర్‌వో ఎస్.డి.అనిత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు తెరిచిన రోజే విద్యాకానుక

● డీఈవో జి.పగడాలమ్మ

గరుగుబిల్లి: పాఠశాలలు తెరిచిన రోజునే విద్యార్థులకు విద్యాకానుక అందజేయాలని, ఆ దిశగా ఏర్పాట్లు చేయాలని డీఈవో జి.పగడాలమ్మ ఆదేశించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను ఆమె మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జూన్ 12వ తేదీన పాఠశాలల పునఃప్రారంభం నాటికి ప్రతీ విద్యార్థి చేతిలో విద్యాకానుక కిట్ ఉండాలని సూచించారు. అలాగే పాఠశాలలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు సరిగా ఉన్నాయా లేదా ఒకసారి చూసుకోవాలన్నారు. తరగతులు మొదలైన తొలిరోజు నుంచే మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పథకం అమలయ్యేలా చూడాలన్నారు. ఆ తర్వాత పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీల సిబ్బందికి ఇస్తున్న శిక్షణను ఆమె సందర్శించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీవో వై.శంకరరావు, ఎంఈవో–2 కె.కొండలరావు, ప్రధానోపాధ్యాయుడు పాత్రుడు పాల్గొన్నారు.


ఘనంగా డిప్యూటీ స్పీకర్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, పార్టీ నాయకులు

విజయనగరం: శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు, బంధువులు వివిధ ఆలయాల్లో ఉదయం పూజలు చేశారు. ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని భగవంతుడిని వేడుకున్నారు. అనంతరం నగరంలోని కోలగట్ల నివాసంలో పార్టీ నియోజకవర్గం నాయకుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, పార్టీ జోనల్ ఇన్‌చార్జ్‌లు కృష్ణారావు, తమ్మన్నశెట్టిలు కలిసి భారీ కేక్‌ను కట్ చేసి, కోలగట్లకు బర్త్‌డే విషెస్ తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు మాట్లాడుతూ మంచి మనసున్న నేతగా, ఆయన సేవా కార్యక్రమాలతో అందరి ఆత్మబంధువుగా వెలుగొందుతున్న కోలగట్ల వీరభద్రస్వామి పుట్టిన రోజును సంబరంలా జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. కోలగట్ల బర్త్ డే సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టివీరవెంకట రాజేశ్వరరావు, పార్టీ జోనల్ ఇన్‌చార్జ్ బొద్దాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ



సమావేశంలోమాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: హైరిస్క్ గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు వైద్యాధికారులకు సూచించారు. ఈ మేరకు మాతాశిశు మరణాలపై మంగళవారం సాయంత్రం ఆయన తన చాంబర్‌లో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణులను గుర్తించిన నాటి నుంచి వారికి అవసరమైన వైద్య సేవలు అందించాలని చెప్పారు. శిశు మరణాలు తగ్గించే విధంగా గర్భిణి దశ నుంచి తగు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. మాతాశిశు మరణాలు పూర్తిగా తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మాతాశిశు మరణాలు జరిగిన ప్రాంతంలో అందుకు గల కారణాలను అన్వేషించాలని సూచించారు. ప్రసవ తేదీకి ముందుగానే హైరిస్క్ గర్భిణులను ఆస్పత్రిలో చేర్పించాలని, హైరిస్క్ తీవ్రతను తగ్గించడానికి అవసరమైన వైద్యాన్ని అందించాలని ఆదేశించారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ బి. గౌరీశంకర్, ఘోషా ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ శుభశ్రీ, పిడియాట్రిక్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుజాత దేవి, అనస్తీషియా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.స్వాతి, డాక్టర్ ఎ.కృష్ణ కుమార్, డాక్టర్ ఎస్.సూర్యనారాయణ, డీపీహెచ్‌ఎన్‌ఓ మామిడి సత్యవతి, డెమో చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన వ్యక్తి మృతదేహం లభ్యం



పొదల్లో ఉన్న మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పూసపాటిరేగ: వెంపడాం గ్రామదేవత పండగకు వెళ్లి, తప్పిపోయిన మండల కేంద్రానికి చెందిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పిన్నింటి బంగారునాయుడు.. కొల్లాయివలస పంచాయతీ, మర్రిపేట సమీపంలో మంగళవారం ఉదయం శవమై కనిపించాడు. ఈ నెల 22వ తేదీన పూసపాటిరేగ పిన్నింటి కల్లాల నుంచి వెంపడాం గ్రామదేవత పండగకు బంధువుల ఇంటికి వెళ్లిన ఆయన.. తిరుగుప్రయాణంలో మతిస్థిమితం లేకపోవడంతో పసపాం నుంచి మర్రిపేట వైపు వెళ్లారు. అక్కడే ఓ లేఅవుట్ దగ్గర ఉండిపోయి అతడు ప్రాణాలు విడిచినట్లు సమాచారం. అక్కడ మృతదేహం ఉన్నట్లు తెలుసుకున్న మర్రిపేట గ్రామస్తులు అక్కడికి చేరుకుని, బంగారునాయుడి మృతదేహంగా గుర్తించి, కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు శవపంచనామా అనంతరం పోస్టుమార్టం కోసం సుందరపేట సీహెచ్‌సీకి మృతదేహాన్ని తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పూసపాటిరేగ ఎస్‌ఐ ఎ.సన్యాసినాయుడు తెలిపారు.

రైల్వేట్రాక్ వద్ద గుర్తు తెలియని మృతదేహం..

కొత్తవలస: మండలంలోని కొత్తవలస–కంటకాపల్లి రైల్వేలైన్‌లో అడ్డూరువానిపాలెం గ్రామ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే ట్రాక్‌మేన్ మంగళవారం గుర్తించి, రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో రైల్వే ఎస్‌ఐ రవివర్మ తన సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయసు 22 నుంచి 25 ఏళ్ల మధ్య ఉంటుందని, రైలు నుంచి జారిపడి చనిపోయి ఉంటాడని భావిస్తున్నామని ఎస్‌ఐ అన్నారు. మృతుడి కుడిచేతిపై 'బుబులి' అని ఇంగ్లిష్‌లో పచ్చబొట్టు ఉందని, అదే చేయి మడమపైన కిరీటం గుర్తు పచ్చబొట్టు కూడా ఉందన్నారు. మృతుడు తెలుపు, నలుపు రంగు గడుల ఫుల్‌హ్యాండ్స్ షర్ట్, నల్లని కాటన్ జీన్ ధరించి ఉన్నాడన్నారు. మృతుడి ఆచూకీ తెలిస్తే ఫోన్ నంబర్లు 9490617089, 9440591331ను సంప్రదించాలని కోరారు. శవపంచనామా అనంతరం విజయనగరం రైల్వే ఆస్పత్రికి మృతదేహం తరలించామని ఎస్‌ఐ తెలిపారు.



రైల్వేట్రాక్ వద్ద యువకుడి మృతదేహం



మృతుడి చేతిపై ఉన్న బుబులి పచ్చబొట్టు



సంఘటన స్థలంలో బంగారునాయుడు మృతదేహం

'సత్య' విద్యార్థికి యూనివర్సిటీ ఫస్ట్ ర్యాంక్

విజయనగరం టౌన్: స్థానిక తోటపాలెంలో ఉన్న సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో బీబీఏ కోర్సు విద్యార్థిని కె.రమ్య 9.07 గ్రేడ్ పాయింట్లతో ఆంధ్రా యూనివర్సిటీ–2024 పరీక్ష ఫలితాల్లో యూనివర్సిటీ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటుచేసిన అభినందన సభలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు మొదటి, రెండవ ర్యాంకులు సాధించిన విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో బీబీఏ కోర్సులో 2024 యూనివర్సిటీ పరీక్షా ఫలితాల్లో రమ్యకు తొలిస్థానం, ఊర్మిక 8.86 గ్రేడ్ పాయింట్లతో రెండోస్థానం సాధించారని చెప్పారు. భవిష్యత్తులో రమ్య, ఊర్మికలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి.సాయిదేవమణి, సీతం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామమూర్తి, 2 ఆంధ్రా గర్ల్స్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ గోపేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.